మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

5 గ్రాములు రూ.300 రూపాయలు

- వెస్ట్ బెంగాల్ నుంచి తీసుకొచ్చి జడ్చర్లలో విక్రయించి..
- 2.700 కేజీల ఎండు గంజాయి పట్టివేత
- జడ్చర్ల ఎక్సైజ్ బృందాన్ని అభినందించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి

మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జడ్చర్ల, మే 11 ప్రభాతవార్త: వెస్ట్ బెంగాల్ నుంచి ఎండు గంజాయిని తీసుకొచ్చి జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి జడ్చర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో వివరాలు మీడియాకు వెల్లడించారు. వెస్ట్ బెంగాల్ కి చెందిన ఇద్దరు మహిళలు సజ్జు లోని హిందుస్థాన్ కంపెనీలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల వెస్ట్ బెంగాల్ లో ఎన్నికలు జరగడంతో అక్కడికి ఓటు వేసేందుకు వెళ్లిన మహిళలు తిరుగు ప్రయాణంలో తమ వెంట 2.700 కేజీల ఎండు గంజాయిని తీసుకొచ్చారు. ఐదు గ్రాములకు రూపాయలు 300 చొప్పున పోలేపల్లి, జడ్చర్ల, బాలానగర్, మోతి నగర్, భూత్పూర్ లాంటి ప్రాంతాల్లో విక్రయిస్తూ వచ్చారు. ఆదివారం రాత్రి సుమారు 10:30 గంటల ప్రాంతంలో కొత్త బస్టాండ్ సమీపంలో ఎక్సైజ్ పోలీస్ అధికారులు రూట్ వాచ్ నిర్వహిస్తున్న సందర్భంలో ఇద్దరు మహిళలు అనుమానస్పదంగా కనిపించడంతో వాళ్ల దగ్గర ఉన్న బ్యాగులు చెక్ చేయగా ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లి విచారించగా పూర్తి వివరాలు వెల్లడించిన్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఏడాది జనవరి నుంచి జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు కేసులు నమోదు చేసి 15 మందిని అరెస్ట్ చేసి ఐదు కేజీల 100 గ్రాముల గంజాయిని సీజ్ చేసినట్లు నరసింహారెడ్డి తెలిపారు. గత ఏడాది 2025లో మహబూబ్నగర్ జిల్లాలో 21 కేసులు నమోదు చేసి 41 మందిని అరెస్టు చేసి 8.90 కేజీల ఎండు గంజాయిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో డ్రగ్స్ పై భాగంగా ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కేసును చేదించిన సిఐ విప్లవ రెడ్డి ఎస్సైలు కార్తీక్ రెడ్డి, నాగరాజు తోపాటు సురేష్ పద్మ అధికారులను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభినందించారు.

ప్రాణాలు తీసిన.. బైక్ రేసింగ్

కారును ఢీ కొట్టిన స్పోర్ట్స్ బైక్

- 140 కిలోమీటర్ల వేగంతో కారును ఢీ కొట్టిన స్పోర్ట్స్ బైక్
- ఐదుగురు దుర్మరణం..
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఘటన

మహబూబ్‌నగర్, మే11ప్రభాతవార్త: అతివేగంతో కూడిన నిర్లక్ష్యం డ్రైవింగ్ వల్ల ఐదుగురు ప్రాణాలు గాలిలో కలిసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డుపై ఆది వారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదు గురు దుర్మరణం పాలయ్యారు. స్థానికులను కలచివేసిన ఈ ఘటన జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. హైదరా బాద్‌కు చెందిన యువకులు స్పోర్ట్స్ బైక్‌పై అత్యంత వేగంగా ప్రయాణిస్తూ మహబూబ్ నగర్ బైపాస్ రోడ్డులో రేసింగ్ చేస్తున్న సమయంలో ఎదురుగా వెళ్తున్న కారును ఢీకొట్టారు. ప్రమాద సమయంలో బైక్ సుమారు 140 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఢీకొన్న ప్రభావం అంత తీవ్రంగా ఉండటంతో బైక్ పూర్తిగా ధ్వంసమై, కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణ స్తున్న ఒకే కుటుంబానికి చెందిన అర్షియా బేగం (30), ఉజేఫ్(7), చిన్నారి అమర్ (2) అక్కడికక్కడే మృతి చెందా రు. అలాగే బైక్‌పై ఉన్న హైదరాబాద్‌కు చెందిన యాకుబ్ అష్టల్ (25)తో పాటు మరో యువకుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో బైపాస్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డుపై రాత్రివేళల్లో యువకులు తరచూ బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధిక శబ్దాలతో, అత్యంత వేగంతో దూసుకెళ్తున్న స్పోర్ట్స్ బైక్‌ల కారణంగా పలుమార్లు ప్రమాదాలు జరిగినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

బాధ్యులపై కఠిన చర్యలు :
డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి

బైపాస్ రోడ్ లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచి వేసిందని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారినిఎంతటి వారైనా ఊరు కునే ప్రసక్తే లేదని, పోలీసులు విచారణ చేపట్టి కేసులు నమోదు చేయాలని సూచించారు. బైక్ రేసింగ్‌కు పాల్పడిన వారు యువకులు ఉన్నారని, కుటుంబ సభ్యు లను పిలిపించి వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదుచేసేలా చర్యలుచేపట్టాలని పోలీసులను కోరారు. బైపాస్ రోడ్డు కూడా ఊరు మధ్య భాగంగా వెళ్లడంతో ప్రమాదాలకు అతి పెద్ద కారణంగా చెప్పవచ్చు అన్నారు.

పోలీస్ అధికారుల నిర్లక్ష్యమే..

రోడ్డు ప్రమాదం పాలకొండ వద్ద జరిగిన ఘటన బాధాకరం
బైక్ రైడర్స్ స్పీడ్‌గా చక్కర్లు కొడుతుంటే పోలీస్‌లు ఏం చేస్తున్నట్లు ? : మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, మే 11 ప్రభాతవార్త : పకడ్బందీగా పోలీస్ వ్యవస్థ పని చేసి ఉంటె ఐదు మంది ప్రాణాలు నిలిచేవని, సీసీ కెమెరాలు పెట్టి..ట్రాఫిక్ సిగ్నల్స్ పెట్టి ఉంటె ప్రమాదాలు జరిగి ఉండేవి కాదని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం అర్ధరాత్రి బైక్ రైడర్స్ కారును ఢీ కొట్టిన ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా వారి మృతదేహాలకు మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ పోలీస్

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

అంటే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచి పేరు ఉండేదని, కొంత మంది అవినీతి అధికారుల తీరు కారణంగా పోలీస్ వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందన్నారు. ఇసుక లారీలు, భూముల సెట్టిల్మెంట్ లు -మిగతా4లో..

రైతు శ్రేయస్సే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు
- ధాన్యం తరలింపులో సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు జారీ

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 11 ప్రభాతవార్త: రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, రైతు కేంద్రంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, కొనుగోలు దారులు, రైస్ మిల్లర్లు పూర్తి స్థాయిలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎవరూ ఎవరినీ బతిమాలుకునే పరిస్థితి రాకుండా, ఎవరు ఎవరిని నిందించాల్సిన అవసరం లేకుండా జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వ హించేలా అందరూ సమిష్టిగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సుఖ జీవన్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రబీ 2025-26 సీజన్‌కు సంబంధిం చిన వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావే శానికి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధ శాఖల ఉన్నతాధికారులు, డీసీఓల సీఈఓలు, డీఆర్‌డీ ఓల ఏపీఎంలు, మండల వ్యవసాయ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు, మార్కెటింగ్, రవాణా, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు, మరియు బాయిల్డ్ రైస్ మిల్లుల ప్రతినిధులు, లారీ కాంట్రాక్టర్లు, ఏఎంసీ కార్యదర్శులతో లతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా స్థాయివిస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం రైతుల కు అండగా నిలుస్తోం దని, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాగర్ కర్నూల్ నియోజక వర్గం పరిధిలో ఈ సీజన్లో మొక్కజొన్న దిగుబడి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గణనీయంగా వచ్చిందని 3 లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి జరిగిందని, అందుకు అనుగుణంగా రైతులకు ఇబ్బందులు లేకుండా మూడు లక్షల గన్ని బ్యాగుల సరఫరా చేయాలని, మొక్కజొన్న కొనుగోలు చేసివెంటనే గూడాన్లకు తరలించేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం ప్రభు త్వంగా రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అందుకు అను కూలంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లర్లు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. కొనుగోలు ప్రక్రియ ముందుగానే ఇలాంటి సమావేశాలు మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించి రైతుల మేలు జరిగేలా చేయడం సంతోషనీయమని అధికారులందరు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ఈ సందర్భం గా సూచించారు. అంతకుముందు అధికారులు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లు, ధాన్యం నిల్వ సామర్థం, రవాణాసదుపాయాలపై ప్రజాప్రతినిధులకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, స్థానిక కౌన్సిలర్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్దలో జనగణన సర్వే

- పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక
- తప్పులు లేకుండా పకడ్బందీగా గణన పూర్తి చేయాలని ఆదేశం

జనగణన సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

దామరగిద్ద, మే 11 ప్రభాతవార్త : జనగణన 2027 మొదటి రోజు సర్వేలో భాగంగా దామరగిద్ద మండల కేంద్రంలో ఎన్యూమరేటర్లు నిర్వ హిస్తున్న సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక సోమవారం సందర్శించారు. బ్లాక్ నంబర్ 62, 63 పరిధిలో సర్వే చేస్తున్న తీరును ఆమె స్వయంగా పరిశీలించి, విధివిధానాల గురించి ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్యూమరేటర్లకు పలు కీలక సూచనలు చేశారు. సర్వేలో భాగంగా మొదటి మూడు రోజులు సంబంధిత ప్రాంతం యొక్క మ్యాపును ఖచ్చితంగా గీయాలని, అందు లో ప్రధాన ల్యాండ్ మార్క్స్ (గుర్తు చిహ్నాలను) స్పష్టంగా గుర్తించాలని సూచించారు. భవనాల గణన మరియు గృహాల సంఖ్యను ముందుగా యాప్‌లో నమోదు చేసిన తర్వాతే ఇంటింటి సర్వేకు వెళ్లాలని స్పష్టం చేశారు. సర్వే నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పకడ్బందీగా గణన పూర్తి చేయాలనిఅధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందరాజులు, ఎంపీడీవో సాయి లక్ష్మి, తహసిల్దార్ తిరుపతయ్య, ఎంఈఓ కృష్ణారెడ్డి, ఎన్యూమరేటర్ అంబ్రేష్, సెక్టోరల్ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతానికి కృషి

- మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల్ మమత
- ఎన్టీఆర్ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

మహబూబ్‌నగర్, మే11 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేయడం, పెండింగ్‌లో ఉన్న పైళ్లను పరిష్క రించడం అనేక విద్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్యారంగాన్ని బలోపేతం చేస్తుందని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల్ మమత అన్నారు. కలిసికట్టుగా పనిచేసినప్పుడే ఈ ప్రగతి ప్రణాళిక విజయవంతమవుతుందని తెలిపారు. మహబూబ్ నగర్ లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పిజి అటానమస్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు కొనసాగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అనే కార్యచరణలో భాగంగా విద్యాశాఖలోని డిగ్రీ) కళాశాలల్లో మే 11 నుండి మే 17 వరకు వారం రోజులపాటు విద్యావారోత్సవాల నిర్వహణలో భాగంగా ఎన్టీఆర్ కళాశాలలో ప్రగతి ప్రణాళికలో భాగంగా నగర మేయర్ మమత కరపత్రాలు, ప్లెక్సీ బ్యానర్ ఆవిష్కరణ చేశారు. అలాగే డిగ్రీ చదువు తూనే పరిశ్రమలు, కార్పొరేట్ హాస్పిటల్స్‌తో అవగాహన ఒప్పందంతో విద్యార్థులో డిగ్రీ పూర్తయిన తర్వాత ప్లేస్మెంట్స్ కల్పించడం వంటి ఎమ్ఓయూలువిడుదల చేశారు. అలాగే విద్యార్థులు పుస్తకాలు కొనాల ంటే చాలా ఖర్చవుతుందన్నారు. కాబట్టి ఆ బుక్ ను ఆన్లైన్ లో లింక్ రూపకంగా అందేలా ప్రిపేర్ చేశారు. అధ్యాపకులు కూడా తమ పరిశో ధన జ్ఞానాన్ని పెంచుకోవచ్చని కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన డిజిటల్ లింకుల ను మేయర్ ఓపెన్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డా. పద్మా అనురాధ, కార్పొరేటర్ ఒమర్ కొత్వాల్, ఐక్యూఏసి కో. ఆర్డినేటర్ డా. శ్రీదేవి, డా. యం. ప్రవీణ్ కుమార్, డా. హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

వరి ధాన్యం లారీలను వేగంగా అన్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలి

- తరుగు పేరిట రైతులను దగా చేస్తే చర్యలు
- జనగణన ఎన్యుమరేటర్లు మొదటి మూడు రోజులు క్షేత్రస్థాయిలో హద్దులను తనిఖీ చేసుకోవాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, మే 11, ప్రభాతవార్త: వరి కొనుగోలు కేంద్రాల నుంచి తరలిన ధాన్యం లారీలు మిల్లుల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండకుండా వేగంగా అన్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోళ్లు, మిల్లుల వద్ద అన్లోడింగ్, జన గణన ప్రక్రియ పలు అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ,

వీసీలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పోలీసు శాఖల సమన్వయంతో రబీ సీజన్ సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు, పోలీస్ అధికారులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో చొరవ తీసుకొని ఎక్కడ ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తరలిన ధాన్యం కేటాయించిన మిల్లుకు చేరిన తర్వాత అక్కడ తరుగు, లేదా ఇతర కారణాల పేరిట రైతులని దగా చేయడానికి వీలు లేదని అటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లులకు తరలిన ధాన్యం వేగంగా అక్కడ అన్లోడ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లుల వద్ద అన్లోడ్ చేసుకోకుండా అనేక రకాల కారణాలు చూపి లారీలను వేచి ఉండేలా చేస్తే చర్యలు తప్పమన్నారు. తహసిల్దార్లు, ప్రత్యేకంగా పర్యవేక్షణ చేసి వేగంగా అన్లోడ్ చేయించాలన్నారు. రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తిన ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. లారీ లు మిల్లుల వద్ద ఒక రోజుకు మించి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడవద్దని సూచించారు. ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను కూడా అవసరమైనన్ని లారీలను అందుబాటులో ఉంచమని సూచించాలని, ఏ విధమైన సమస్యలు రాకుండా చూడాలని తెలియజేయాలన్నారు. మొత్తంగా, ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యత అని, మిల్లర్లపై అధికారు లు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించి సజావుగా పూర్తయ్యేలా -మిగతా4లో..

ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని జయించాలి

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా
- పిల్లలను క్రమం తప్పకుండా భవిత కేంద్రాలకు పంపాలి : డిఇఓ ప్రవీణ్ కుమార్
- 112 మంది దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 11, ప్రభాతవార్త: ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యాన్ని కూడా జయించవచ్చని జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ భవిత కేంద్రంలో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష అలింకో ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగులకు వివిధ రకాల ఉపకరణాలు172 మంది విద్యార్థులకు వీల్ చైర్స్, ట్రైసైకిల్స్ , రోల టర్స్, సీపీ చైర్స్, వినికిడి యంత్రాలు, టీఎల్ఎం కిట్లు, బ్రెయిలీ కిట్లు, తదితరుల ఉపకరణాలను అందజేస్తూ ప్రసంగించారు. వైకల్యం అనేది శరీరానికి తప్ప మేధస్సుకు కాదని, ఎంతోమంది వైకల్యం కలిగి ఉన్నప్ప టికీ ఆత్మవిశ్వాసంతో అద్భుత విజయాలు సాధించారని గుర్తు చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు వైకల్యం కలిగిన పిల్లలను ప్రోత్సహించి వారు కూడా సాధారణ పిల్లలవలే చదువుకునేలా చూడాలని అన్నారు. పూర్తిగా బడికి రాలేని వారికి ఇంటివద్దనే విద్య అందిస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రానికి వచ్చే విద్యార్థులకు ప్రత్యేకంగా సదరం క్యాంపు లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా విద్యా శాఖధికారి

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా

ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని అన్నారు. వారిపై వివక్ష చూపరాదనీ తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా విలీన విద్య సమన్వయ కర్త (సిఎంఓ)సుధాకర్ రెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్, మహబూబ్‌నగర్ అర్బన్ మండల విద్యాధికారి లక్ష్మీణ్ సింగ్, వెంకటేశ్వర కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రఘుబాబు, శివశంకర్, మైబన్న, నందన్, మన్యమయ్య, సంగీత, విజయలక్ష్మి, సునీత, అనురాధ ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలపై కలెక్టర్ ఆరా..

- రోగులకు మెరుగైన వైద్యం అందించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 11 ప్రభాతవార్త: కర్నూల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ రోగాలతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం ఉదయం 7 గంటలకే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మి కంగా తనిఖీ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, విధుల్లో ఉన్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది హాజరు వివరాల ను తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిరక్ష్యం చోటుచేసు కోకూడదని హెచ్చరించారు. రోగులకు సమయానికి వైద్యం అందించడంతో పాటు అత్యవసర సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లిన కలెక్టర్ వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై స్వయంగా ఆరా తీశారు. మందులు సమయానికి అందుతున్నాయా, డాక్టర్లు క్రమం తప్పకుండా పరీక్షిస్తున్నారా, వసతులు ఎలా ఉన్నాయనే అంశాలపై రోగుల ను ప్రశ్నించారు. కొంతమంది రోగులు ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగ్గా అందుతున్నాయని చెప్పగా, మరికొందరు పరిశుభ్రత విషయంలో మరింతగా దృష్టి పెట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగు దొడ్లు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. రోగులు మరియు వారి సహాయకులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ఆసుపత్రి వైద్యాధికారులు బాధ్యత అని, తాను మళ్లీ వచ్చే సందర్శన వరకు పరిశుభ్ర వాతావరణంలో ఉండాలని, లేనియె డల కఠినచర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో -మిగతా4లో..

వరి, మొక్కజొన్న వెంటనే కొనుగోలు చేయాలి

రైతులను ముప్పు తిప్పలు పెట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి రూరల్, మే 11, ప్రభాతవార్త: రైతులు ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నెలల తరబడి వేచి చూస్తున్న రైతులను ముప్పు తిప్పలు పెట్టడం ప్రభుత్వ నిరక్ష్యాన్నికి నిదర్శనమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బి.ఆర్.ఎస్ శ్రేణులతో కలసి తాళ్ళ చెరువు, చినగుంటపల్లి, గోపాలపేట, వనపర్తి మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రతిగింజ కొంటాం అన్న మంత్రుల, అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. రైతుబంధు ఇవ్వకున్న, కరెంటు కోతలు ఉన్నా, సాగునీరు ఇవ్వకున్నా అష్టకష్టాలు పడి పండించిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కొనకుండా రైతులను హరిగోసలుపెడుతున్న ప్రభుత్వం ఆగంకాక తప్పదని హెచ్చరించారు. ట్రా

బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

-మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, మే 11 ప్రభాతవార్త: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. వెల్దండ మండల కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు పుట్ట రాంరెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ మైనర్ బాలికను భగీరథ అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసిన అరెస్టు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని, అందరికీ ఒకే చట్టమని ఫోక్సో చట్టం కింద అరెస్ట్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి బండి సంజయ్‌ని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలోసర్పంచ్ కొండలు యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, అధికార ప్రతినిధి జంగిలి నిరంజన్, నాయకులు జోగయ్య, శేఖర్, కొండల్, గణేష్, శ్రీను, రవితో పాటు తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలి

● ఆయన కుమారుడు భగీరథను అరెస్టు చేయాలి ● జడ్చర్లలో బిఆర్ఎస్ నాయకుల డిమాండ్

తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన బిఆర్ఎస్ నాయకులు

జడ్చర్ల, మే 11 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ మైనర్ బాలికను అఘాయిత్యం చేసిన ఘటనలో పోలీసులు నిందితునిపై పోలీస్ స్టేషన్లో కేస్ నమోదు కావడం జరిగిందని, అతనిపై పోలీసులు చర్యలెందుకు తీసుకోవడం లేదని మాజీ జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కొడుగల్ యాదయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోక్సో కేసు నమోదై మూడు రోజులు గడుస్తున్నా భగీరథ్‌ను అరెస్ట్ చేయకుండా కాపాడుతున్నారని మండిపడ్డారు. జడ్చర్ల తహసిల్దార్ కార్యాలయం ఎదుటబిఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ ఘటనలో పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పోక్సో కేసు నమోదైతే పేద ప్రజ లకు ఒక న్యాయం,అధికారంలో ఉన్న వారికిమరొక న్యాయం ఉంటుందా అన్నారు. కుమారుడిని రక్షించేందుకు బాధితకుటుంబాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ భయభ్రాంతులకు గురి చేస్తున్నా రని బాధితులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన కేంద్రమంత్రి సంజయ్ వెంటనే తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై హోంమంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు స్పందించడం లేదన్నారు. న్యాయం కోసం బాధిత కుటుంబం మూడు నెలలుగా తిరుగుతుంటే ఎవరు పట్టించుకునే వారు లేరని యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు

ఆత్మకూర్ మే 11, ప్రభాతవార్త: అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళలపై అఘాయిత్యాలు చేయడమే కాకుండా ఫోక్సో కేసు నుంచి తప్పించుకునేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని ఆత్మకూరుమండల మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, బి ఆర్ఎస్ ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్, తదితరులు తీవ్రస్థాయిలో ఆరోపించారు. సోమవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు పూను కుంటామని వారు హెచ్చరించారు. దేశానికి హోంశాఖ సహాయ మంత్రి పదవిలో కొనసాగుతున్న బండి సంజయ్ చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష పార్టీ నాయకులపై అనవసరమైన ఆరోపణలు చేస్తూ దిగజారులు తనానికి పాల్పడుతున్నాడని వారు ఆక్షేపించారు. గత ప్రభుత్వ హయాంలో మహిళల పై అత్యాచారాలకు పాల్పడిన వారిని కేవలం రెండు మూడు రోజుల్లోనే శిక్షించిన ఘటన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకే దక్కుతుందని వారు తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన మరియు ప్రజా ప్రభుత్వము గా కోరుకుంటూ తప్పు చేసిన వారిని కాపాడేందుకే ప్రయత్నించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నిం చారు. మైనర్ బాలికకు బలవంతంగా మద్యం సేవింపజేసి అత్యాచారానికి పాల్పడడమే కాకుండా బాధిత కుటుంబ సభ్యులను కేంద్ర మంత్రి బండి సంజయ్ బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్‌పార్టీ నాయకులు రియాజ్ అలీ, వీరేశలింగం, మండల రామకృష్ణ, గడ్డమీద శ్రీనివాసులు, బాల్రాజ్, జాంగిర్, శివన్న, అజపాగ మాసన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లు గీత సహకార సంఘ అధ్యక్షునిగా మదన్ గౌడ్ ఎన్నిక

వెల్దండ, మే 11 ప్రభాతవార్త: వెల్దండ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో కల్లుగీత సహకార సంఘ ఎన్నికలను ఆబ్కారి సహకార సంఘాల ఇన్‌స్పెక్టర్ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలోఎన్నికలు నిర్వహించగా వెల్దండ గ్రామపంచాయతీకి చెందిన మట్ట మదన్ గౌడ్ ఏకగ్రీవంగా సహకార సంఘ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మట్ట విష్ణు గౌడ్, కార్యదర్శిగా కృష్ణయ్య గౌడ్, డైరెక్టర్‌గా నిరంజన్ గౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మదన్ గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్, మట్ట కృష్ణ గౌడ్, ఆంజనేయులు, చంద్రకాంత్ గౌడ్, నాగయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

సమ్మర్ క్యాంపును ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ, ఎంపీడీవో రామకృష్ణ

మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మను సన్మానిస్తున్న దృశ్యం

వడ్డేపల్లి, మే11 ప్రభాతవార్త : వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ, కౌన్సిలర్ విజయ్ భాస్కర్ సమక్షంలో సోమవారం శాంతినగర్ జడ్పిహెచ్ఎస్ స్కూల్ లో సమ్మర్ క్యాంప్ 2026 ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది సభ్యుల మధ్య ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. జ్యోతి ప్రజ్వలనతో సమ్మర్ క్యాంప్ అధికారికంగా ప్రారంభించబడింది. విద్యార్థులు పుష్పగుచ్చాలు అందించి సాంస్కృతిక కార్యక్రమాలతో అతిథులను ఆహ్వానించారు. చైర్మన్ మంజుల ధర్మ మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకత భావప్రసార నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అభ్యాసం,వినోదం కలగలిపిన కార్యక్రమాలను నిర్వహించినందుకు నిర్వాహకులను ఆమె అభినందించారు. కౌన్సిలర్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూపాఠ్యేతరకార్యకలాపాల ప్రాముఖ్యతను వివరించారు. సెలవులను సద్వినియోగం చేసుకొని అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహించారు సమ్మర్ క్యాంప్‌లో కళలు,చేతిపనులు, నృత్యం,సంగీతం, క్రీడలువ్యక్తిత్వ వికాస తరగతులు, కథలు చెప్పడం,సరదా పోటీలు నిర్వహించబడనున్నాయి.విద్యార్థుల సంపూర్ణ వికాసాన్ని లక్ష్యంగా చేసుకొని ఈసమ్మర్ క్యాంప్ కార్యక్రమాలు రూపొందించబడ్డాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట, మే11 ప్రభాతవార్త : నారాయణపేట జిల్లా వాస్తవ్యులైన అర్హులైన గిరిజన బాలబాలికల నుండి 2026,27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్ (బేగంపేట, రామంతపూర్)లో మొదటి తరగతి డే స్కాలర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, రూమ్ నం.123, ఐడీఓసీ, పాలకొండ, మహబూబ్‌నగర్‌లో సమర్పించాలని సూచించారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించబడవని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం నుండి పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01.06.2019 నుండి 31.05.2020 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారిది రూ.2 లక్షలు మించరాదని పేర్కొన్నారు అభ్యర్థులు నివాస ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత తహసీల్దార్ నుండి, కుల, జననతేది, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను మీ సేవ ద్వారా పొందాలని సూచించారు. అన్ని ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను అట్టెస్ట్ చేయించి దరఖాస్తుతో జతపరచాలని తెలిపారు.

స్థాయికి మించిన విమర్శలు మానుకోవాలి

- భూకబ్జాలకు కేరాఫ్ బిఆర్ఎస్ నాయకులు
- విజయ డైరీ అక్రమాలను బయటపెడతాం..
- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అయ్యుబ్ పాష, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జరుపులావత్ రమేష్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఊర్కొండ, మే 11 ప్రభాతవార్త: బురదలో రాయి వేస్తే అది మీ మీదనే పడుతుంది.. ఎమ్మెల్యేని విమర్శించే ముందు మీ గతాన్ని, మీ స్థాయిని ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అయ్యుబ్‌పాష, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్‌లు ధ్వజమెత్తారు. సోమవారం ఊర్కొండ మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోని పదేళ్ల వైఫల్యాలను, అక్రమాలను ఏకరువు పెట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి మండలంలో భూకబ్జాలకు నిలయంగా మారిందని వారు ఆరోపించారు. వందల ఎకరాల ప్రభుత్వ, పేదల భూములను బీఆర్ఎస్ నాయకులు అడ్డగోలుగా కబ్జా చేసింది వాస్తవంకాదా అని ప్రశ్నించారు.ఊర్కొండ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భూకబ్జాలకు పాల్పడి, కోట్లకు పడగలెత్తింది మీ నాయకులు కాదా అని నిలదీశారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉండి కూడా సొంత నియోజకవర్గంలోని మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయలేని అసమర్థత మీదని. కేవలం కొబ్బరికాయలు కొట్టడానికే పరిమితమైన మిమ్మల్ని ప్రజలు కొబ్బరికాయలమంత్రి అని పిలుచుకుంటున్న విషయం మర్చిపోయారా?" అనిఎద్దేవా చేశారు. పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టలేదని, దళిత బంధులోనూ అక్రమాలేనని ధ్వజమెత్తారు. విజయ డైరీలో జరుగుతున్న భారీ అక్రమాల వెనుక బీఆర్ఎస్ కీలక నాయకుల హస్తంఉందని, రైతులను ముంచినచరిత్ర మీదని ఆరోపించారు. "నీ అక్రమాల చిట్టా మా దగ్గర ఉందని, త్వరలోనే అన్నింటినీ బయటపెడతాం.. జాగ్రత్త బిడ్డ అంటూ ఘాటుగా హెచ్చరించారు. మూడేళ్లలోనే అభివృద్ధి బాటలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఈ విమర్శలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను అర్హులైన ప్రతి కుటుంబానికి అందిస్తున్న ఘనత మా ప్రభుత్వానిదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా నెరవేరుస్తుందని,ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు తమ చిల్లర రాజకీయాలుమానుకొని ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.లేనిపక్షంలో ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి

- సనాతన ధర్మం అని నీతులు వల్లించే బండి సంజయ్ నీ కొడుకును శిక్షించు..
- బిజెపి,కాంగ్రెస్ పార్టీది చీకటి స్నేహం
- జిల్లా మాజీ అధ్యక్షులు గట్టు యాదవ్

అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేపడుతున్న బిఆర్ఎస్ నాయకులు

వనపర్తి, మే 11, ప్రభాతవార్త: మైనర్ బాలికపై అత్యాచారం చేసిన బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉంటూ నిత్యం సనాతన ధర్మం రక్షణ భేటీ బచావో భేటీ పడావ్ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పే బండి సంజయ్ వెంటనే తన కొడుకు బండి భగీరత్ ను అరెస్టు చేయించి విచారణకు ఆదేశించాలని గట్టు యాదవ్ డిమాండ్ చేశారు. కెటిఆర్ మీద డ్రగ్స్ ఆరోపణలు చేయడం నిరూపించలేకపోవడం నీ అసమర్థత అని దుయ్యబట్టారు. సంజయ్ నీలాగా నీ కొడుకు కూడా తంబాకు,డ్రగ్స్ వాడి అసాంఘిక కార్యక్రమాలు చేస్తుంటే చర్యలు తీసుకోవా అని ప్రశ్నించారు. ఫోక్సో కేసు నమోదు చేసి 50 గంటలు గడుస్తున్న నీ చీకటి మిత్రుడు రేవంత్ రెడ్డి సహకారంతో బాధితులను బెదిరిస్తూ కొడుకును కాపాడే ప్రయత్నం చేస్తున్నావు అని దుయ్యబట్టారు. వెంటనే సాయిభగీరథ్‌ను అరెస్టు చేయకపోతే బిఆర్ఎస్ ఆధ్వర్యంలోఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో నందిమల్ల అశోక్, కె.మాణిక్యం, గంధం పరంజ్యోతి, రఘు వర్ధన్ రెడ్డి,కౌన్సిలర్స్ మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, బొబ్బిలి ప్రేమ్ కుమార్, నీలస్వామి, హేమంత్ ముదిరాజ్, జోహెబ్ హుస్సేన్, ధర్మా నాయక్, అస్లాం, కవితా నాయక్, ఇమ్రాన్, సూర్యవంశం గిరి, ముని కుమార్, చిట్యాల రాము, పోతులపల్లి రాజు, సయ్యద్ జెమిల్ ,నందిమల్ల రమేష్, విష్ణు సాగర్, జె.శ్రీనివాసులు, చిలుక సత్యం,మంద రాము, నందిమల్ల సుబ్బు, అనపటి రాము తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అరుణమ్మ సహకారంతో ఆత్మకూర్‌ను అభివృద్ధి చేస్తాం

బిజెపి రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి

ఆరవ వార్డులో ఐమాక్స్ లైట్లు ప్రారంభిస్తున్న లక్ష్మీ కాంత్ రెడ్డి

ఆత్మకూర్ మే 11, ప్రభాతవార్త: గత మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ సహకారంతో ఆత్మకూరు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు చీరలు తీసుకుంటున్నామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఆరవ వార్డులో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి సొంత నిధులతో హైమాక్స్ రేట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన సమస్యలను గుర్తించి ఎంపీ అరుణమ్మదృష్టికి తీసుకెళ్లడమే కాకుండా తక్షణమే పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లుగా ఆయన వెల్లడించారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రతిపక్ష పార్టీలపై అనవసర ఆరోపణలు చేసేందుకే కాలం సరిపోతుందని ఇప్పటికైనాముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత రబీ సీజన్లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుందని ఇప్పటికేరైతులకు రైతు భరోసా నిధులు రెండుసార్లు ఎగ్గొట్టిన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించారని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఆత్మ కూర్ పట్టణ అభివృద్ధి కోసం ఎంపీ అరుణమ్మ ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు స్థానిక నేతలతో రాజకీయాల కతీతంగా ముందుకు వెళ్లేందుకు తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో ఆత్మకూరు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ కౌన్సిలర్లు భరత్ కుమార్, జిందే జ్యోతి శ్రీనివాస్, నరేందర్ తదితరులతో పాటుగాఆత్మకూరు మండల బిజెపిఅధ్యక్షులు అశోక్ భూపాల్‌యాదవ్ ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు సురేష్ బీజేపీ నాయకులుమనివర్ధన్‌రెడ్డి,ఎల్లన్న,రాజు,లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

పిల్లలలో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం : మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్

ఉప్పునుంతల సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ఉప్పునుంతల, మే11 ప్రభాతవార్త: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసిసర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుందని, సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పిల్లలలో నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిబిరం ఉద్దేశమని మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్ అన్నారు. సోమవారం స్థానిక పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవాన్ని ఎంఈఓ ప్రారంభించారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, ధ్యానం, స్టోరీ టెల్లింగ్, పుస్తక పఠనం, కంప్యూటర్ బేసిక్స్ వంటి విద్యా నైపుణ్యాలతో పాటు క్రీడలు, సైన్స్, ప్రయోగాలు, చిత్రలేఖనం,కుంటూ,అల్లికలు, క్రాఫ్ట్ వంటి క్రియేటివ్ కార్యక్రమాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. చదువుతోపాటు శారీరక, మానసిక, సృజనాత్మక వికాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 6 వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు చదివే విద్యార్థులందురు ఈ శిబిరంలో ఉచితంగా పాల్గొనవచ్చు అని పిఎం శ్రీజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి సూచించారు. వేసవిని వినోదంతో పాటు విజ్ఞానం గా మార్చుకునే అవకాశాన్ని పిల్లలు వినియోగించుకోవాలని కోరారు. సమ్మర్ క్యాంపు మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ పర్యవేక్షణలో కొనసాగుతుందని కాంప్లెక్స్ హెచ్ఎం,పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవానికి మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, రాజస్వ ప్రధాన ఉపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నర్మద, ఉపాధ్యాయులు నీలంశ్రీధర్,పోకలసతీష్, శ్యాంసుందర్‌గౌడ్,అజ్మతుల్లా, శ్రీనివాసులు, మల్లారెడ్డి, లక్ష్మణ్,గోపి, కల్పన,రాజ వర్ధన్ రెడ్డి, స్థానికులు కొత్త అచ్యుతారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు అంతటి శేఖర్ గౌడ్,సమ్మర్ క్యాంపులోశిక్షణపొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

పియూలో ఇంజనీరింగ్ ల్యాబ్‌ల ప్రారంభోత్సవం

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్, అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు

మహబూబ్‌నగర్, మే 11 ప్రభాతవార్త : పాలమూరు యూనివర్సిటీలో స్పోర్ట్స్ గ్యాలరీలో సోమవారం ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పలు ఆధునిక ల్యాబ్‌ల ను ప్రారంభించారు. ఇందులో భాగంగా బీఈఈ ల్యాబ్, ఇంజనీరింగ్ వర్క్‌షాప్ ల్యాబ్, ఇంజనీరింగ్ ఫిజిక్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్, అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేష్ బాబు హాజరై ప్రయోగశాలలను ప్రారంభించారు. వైస్ ఛాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ విద్యార్థులకు ఇట్టి ప్రయోగశాలల ద్వారా వారికి విషయ పరిజ్ఞానం పైన మంచి పట్టు లభిస్తుందని, విద్యార్థులకు వివిధ మౌఖిక పరీక్షలలో విజయం సాధించుటకు విద్యార్థుల ఉన్నత చదువులలో శాస్త్రవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఈ ప్రయోగశాల పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పాలమూరు యూనివర్సిటీ ప్రొ॥ పూస రమేష్ బాబు సార్, యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్ చంద్ర కిరణ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. ప్రవీణ, కళాశాలల ప్రిన్సిపాల్స్, వివిధ విభాధిపతులు, ఇంజనీరింగ్ కళాశాల విభాగాధిపతి బి. తేజ వర్ధన్, ఇంజనీరింగ్ అధ్యాపకులు డా. పి. రామరాజు, డా. ఎ. రమేష్‌రెడ్డి, వడ్ల రవికుమార్, జి.రవికుమార్, సుధారాణి, రోజా, నాన్ టీచింగ్ సిబ్బంది భరత్, ఆంజనేయులు, దీపక్ పాల్గొన్నారు.

కోరం లేక కో-ఆప్షన్ ఎన్నిక వాయిదా...

మున్సిపల్ కమిషనర్ షేక్ మహమ్మద్

కల్వకుర్తి, మే 11 ప్రభాతవార్త: మున్సిపాలిటిలో కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేసినట్లు కమిషనర్ మహమూద్ షేక్ తెలిపారు. మున్సిపల్ కో-ఆప్షన్ కౌన్సిల్‌ను ఎన్నుకునేందుకు తేది.11.05.2026 సోమవారం నాడు ఉదయం 11.30 గంటలకు నిర్వహించిన సమావేశానికి కౌన్సిల్ సభ్యులు ఇద్దరు మాత్రమే హాజరు కావడంతో కోరం సరిపోనందున కోఆప్షన్ సభ్యుల ఎన్నిక వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

నేడు హనుమాన్ జయంతి ఉత్సవాలు

కల్వకుర్తి, మే 11 ప్రభాతవార్త: కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ పొండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు తెలిపారు.ఉదయం 7 గంటలకు ఆంజనేయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అనంతరం 9గంటలకు హనుమాన్ చాలీసా 41 సార్లు పారాయణం ఉంటుందని తెలిపారు.ఈ హనుమాన్ జయంతి వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని దేవాలయం చైర్మన్ పొండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఆలయ అర్చకులు లక్ష్మి నారాయణలు కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

**మల్దకల్ మ

సాంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు తెలంగాణ

-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఉత్సవాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, మే 11 ప్రభాతవార్త: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణరాష్ట్రంలో సాంస్కృతి సంప్రదా యాలకు పుట్టినిల్లు అని భక్తితోనే ముఖ్య లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో కురుమ కుల దైవమైన బీరప్ప సమేత కారామతి కళ్యాణ మహోత్సవ వేడుకలు, పూజాకార్యక్రమాలకు వేర్వురుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జాతీయ ఓబీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, ఐక్యత పౌండేషన్ చైర్మన్ సంకిరెడ్డి టాస్క్ సిఓఓ రాఘవేందర్ రెడ్డిలు పాల్గొని స్వామివారిని దర్శించుకు న్నారు. నిర్వాహకులు అతిథులను శాలువాలతో సన్మానించారు. సోమవారంతో బీరప్ప స్వామి ప్రతిష్ట కళ్యాణోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్‌యాదవ్, సర్పంట్ మట్టయాదమ్మ వెంకటయ్య గౌడ్, చిందం కృష్ణయ్య, తాంబాల్, పెద్ద కురుమ వెంకటయ్య, మల్లేష్, జంగయ్య, రామకృష్ణ, పర్వతాలు, రాములు, బీరయ్య, కుమారు, భాస్కర్, వెంకటయ్య, మల్లయ్య, శ్రీశైలం, విక్రమ్, శివ తదితరులు ఉన్నారు.

ఒకటో వార్డులో పర్యటించిన జిల్లా కలెక్టర్

వార్డులో పర్యటించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నారాయణ పేట, మే 11 ప్రభాతవార్త: నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక విస్తృతంగా పర్యటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యాచరణలో భాగంగా కొనసాగుతున్న పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వార్డులో ప్రజలను కలుసుకుని తాగునీరు, మురుగు కాల్వల పరిశుభ్రత, పారిశుద్ధ్య సమస్యలపై ఆరా తీశారు ఇంటి చెత్తను మున్సిపాలిటీ చెత్త సేకరణ ఆటోలలోనే వేయాలని, ఆరుబయట పడేయవద్దని ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ ఎన్. శంకర్, వార్డు కౌన్సిలర్ సుతారి సత్య రఘుపాల్ రెడ్డితో కలసి వార్డులలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించి సేవలను మరింత మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం బారంబావిసమీపంలోని వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ఉన్న వసతి సదుపాయాలపై నిర్వాహకులతో మాట్లాడి అవసరమైన సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. తదుపరి బాలసదన్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. గదులు, వంటగదిని పరిశీలించి అల్పాహారం, భోజన సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ మహేష్, పర్యావరణ ఇంజినీర్ భరత్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒండ్రు మట్టి తరలింపుపై అఖిలపక్షం కఠిన షరతులు

- గజలమ్మ ఆలయ నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయిస్తేనే పనులకు అనుమతి

- లేకపోతే అడ్డుకుంటామని హెచ్చరిక

సమావేశంలో పాల్గొన్న మండల నాయకులు

ధన్వాడ,మే 11 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ధన్వాడ పెద్ద చెరువు నుంచి ఒండ్రు మట్టి తరలింపుపై కొనసాగుతున్న వివాదం రోజురోజుకు ఉధృతమవుతోంది. సోమవారం ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈ అంశంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చెరువు నుంచి తీయబడుతున్న ఒండ్రు మట్టిని స్థానిక రైతుల అవసరాలకు వినియోగించకుండా, ఇతర మండలాలకు ఇటుక బట్టీల కోసం తరలిస్తున్నారని యువత తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఈ తరలింపును అడ్డుకోవడంతోఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన సమావేశంలో, గ్రామ పూర్వీకుల ఊరి దేవత గజలమ్మ ఆలయం కూలిపోయిన దృష్ట్యా, ముందుగా ఆలయ పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని అఖిలపక్ష నాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆలయ నిర్మాణానికి రూ. 25 లక్షలు సమకూర్చిన తర్వాతనే మట్టి తరలింపును కొనసాగించేందుకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. లేకపోతే మట్టి తరలింపును పూర్తిగా అడ్డుకుంటామని సమావేశంలో గట్టిగా హెచ్చరించారు. ఈ విషయాన్ని గుత్తేదారు దృష్టికి తీసుకెళ్లి, ఆలయ నిర్మాణానికి తగిన నిధులు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని పలువురు నాయకులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యువత ప్రతినిధులు ఇర్బాన్ అహ్మద్, జడల బాలరాజు, ప్రకాశ్, శివతో పాటు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

పెబ్బేరు వాసి పద్మజా రెడ్డికి గోల్డ్ మెడల్ ప్రదానం

◆ శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ఘన సత్కారం

పెబ్బేరు, మే 11 ప్రభాతవార్త: ఆధ్యాత్మిక రంగంలో పెబ్బేరు పట్టణానికి చెందిన పద్మజా రెడ్డి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమంలో ఆమె ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. పెబ్బేరు నివాసి కీ.శే. తలకంటి నరసింహారెడ్డి కుమార్తె అయిన పద్మజా రెడ్డి, భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను కంఠస్థం చేసి పారాయణ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మైసూర్ అవధూత దత్త పీఠాధిపతి, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా మే 10, 2026న ఆమెకు ఘనంగా గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గచ్చిబౌలిలోవేలాది మందిభక్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్ర మంలో పద్మజారెడ్డి గీతాశ్లోకాలను స్పష్టంగా, దోషరహితంగా పఠించినందుకు స్వామీజీ ప్రత్యేకంగా అభినందిస్తూ ఆశీర్వచనాలు అందజేశారు. భగవద్గీత పట్ల ఆమె చూపిన శ్రద్ధ, క్రమశిక్షణ మరియు ఆధ్యాత్మిక నిబద్ధత పెబ్బేరు పట్టణానికి గర్వకారణమని స్థానికులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర మంత్రి కుమారుడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

◆ నిస్పక్షపాత విచారణకు డిమాండ్ ◆ డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్

మహబూబ్‌నగర్, మే 11, ప్రభాతవార్త: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఒక మైనర్ బాలికపై జరిగిన అకృత్యాలకు సంబంధించి వచ్చినఆరోపణల నేపథ్యంలో, ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠినంగా వ్యవహరించాలని డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ సోమవారం కోరారు. హైదరాబాద్‌లోని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసువివరాల ప్రకారం, ఫామ్‌హౌస్‌లో ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. చట్టం ముందు అందరూ సమానులే అనే రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పుడు నిందితుడు ఎంతటి ప్రభావంతమైన వ్యక్తి అయినా తక్షణమే అరెస్టు చేసి, పారదర్శకమైన విచారణ జరపాలని కోరారు. ఒక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి, తన కుమారుడిపై ఇటువంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు నైతిక బాధ్యత వహించాలనీ, ఈ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

◆ ఫిర్యాదు చేసిన పట్టించుకోని మున్సిపల్ అధికారులు

◆ కలెక్టర్ చొరవతో సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజల విజ్ఞప్తి

వనపర్తి, మే11, ప్రభాతవార్త: చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీలో కొందరు లబ్ధిదారులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కో కన్వీనర్ మడ్ల రాజు, సభ్యులు జమీర్, గోపాలకృష్ణ, సాయిలీల సంయుక్తంగా జిల్లా ఆడిషినల్ కలెక్టర్ యాదయ్యను కోరారు. సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రాన్ని సమర్పించి వారు మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ కాలనీలో తమకు కేటాయించిన ఇళ్ల ముందు, మెట్ల పక్కన, చాంబర్లపై అక్రమంగా బాత్‌రూమ్‌లు, షాపులను నిర్మిస్తున్నారని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిరక్ష్యం ఈ అక్రమ నిర్మాణాల గురించి గతంలో (31/12/2024 నాడు) మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వారు మండిపడ్డారు. తొలగించని కట్టడాలు అక్రమంగా ఇల్లు నిర్మించిన వారికి అసోసియేషన్ తరపున స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా, వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. కలెక్టర్ జోక్యం కోరుతూ అధికారుల ఉదాసీనత వల్ల కాలనీలో రోజురోజుకూ అక్రమ కట్టడాలు పెరిగిపోతున్నాయని, తద్వారా కాలనీ అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని వారు పేర్కొన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి, మున్సిపల్ అధికారులను ఆదేశించి ఈ అక్రమ నిర్మాణాలను తొలగించాలని, కాలనీ అభివృద్ధికి సహకరించాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల డబుల్ బెడ్ రూమ్ అభివృద్ధి కమిటీ కో కన్వీనర్ మండ్ల రాజు, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, సహాయ కార్యదర్శి జమీర్, సాయి లీల తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో డిజిటల్ విద్య

-వరి కొనుగోళ్లపై బీఆర్ఎస్ లేనిపోని రాద్ధాంతం

-భూత్పూర్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్ జిజెసీలో మున్సిపల్ చైర్మన్, డీఐఈఓ, ప్రిన్సిపాల్‌లతో కలసి డిజిటల్ బోర్డులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్,మే11,ప్రభాతవార్త: 2026-27విద్యా సంవత్సరం నుంచి తమ ప్రభుత్వం ఇంటర్‌లో డిజిటల్ విద్యను అమలు చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇంటర్ బోర్డుతో చర్చించి ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. సోమవారం ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాలలో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రారంభించారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక-99రోజుల ప్రణాళికలో భాగంగా ఐఎఫ్‌పీఎస్, ఐడీపీఎస్ బోధనలతో నాణ్యమైన విద్య-భవిష్యత్తుకు నాంధి కార్యక్రమంలోపాల్గొని డిజిటల్ క్లాస్ రూం బోర్డులను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంఎంతో ప్రతిష్టాత్మకం గా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థుల కోసం డిజిటల్ విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ), ఇంటరాక్టీవ్ డిజిటిల్ ప్రొజెక్టర్స్ (ఐడీపీ) బోధనను ప్రవేశపెట్టనుందని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులు ఈసదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు.

వరికొనుగోళ్లపై బీఆర్ఎస్ రాద్ధాంతం : వరికొనుగోళ్ల విషయంలో తమ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంధులు కల్గకుండాఅన్ని చర్యలు చేపట్టిందని, ప్రతిపక్ష బీఆర్ ఎస్ గోరంతలు కొండంతలుగా చేస్తోందని, వరికొనుగోళ్ల విషయంపై రాద్ధాంతం తగదని ఎమ్మెల్యే జీఎంఆర్ బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నారని, ప్రతిపక్షానికి చెప్పుకునేదేదిలేక వరికుప్పల వద్ద రాజకీయం చేస్తున్నారని విమర్శించారు .ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తు, పబ్బం గడిపే చర్యలకు బీఆర్ఎస్ స్వస్తి చెప్పాలని సూచించారు. రైతు సమస్యలపై 24గంటలు అప్రమత్తంగా ఉంటూ రైతులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. కొన్ని చోట్లగన్నీ బ్యాగ్‌ల కొరత, వెహికల్ అరెంజ్‌మెంట్స్ విషయంలో కొంత జాప్యం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీటన్నింటిని అధిగమించి రైతులకు 24/7గంటల నిరంతర సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొంటామని, తడిసిన ధాన్యం కూడా కొంటామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ ప్రకటించారని రైతులు ఎలాంటి ఆందోళన, దిగులు చెందాల్సినఅవసరం లేదని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు.

సొంతింటి ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: పేదోడి సొంతింటి కలను నెరవేర్చడమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. మండలంలోని చౌలతండా పరిధిలోని ఏకులగడ్డ తండాలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రభుత్వంతరఫున నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీఐఈఓ రమణి, కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్ గుప్త, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఐదోవార్డు కౌన్సిలర్ కెండ్యాల పద్మ, ఏడోవార్డు కౌన్సిలర్ లతతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు మలిశెట్టి వెంకటేష్ (కొత్తమొల్గర), మాసగౌడ్(కప్పెట), తారు నాయక్(భట్టుపల్లితండా ఏవీఆర్ కాలనీ), సుశీలమ్మ(పెద్దతండా), కొర్ర మణెమ్మ(చౌలతండా), రమేష్(వెల్కిచర్ల)లతో పాటు భూత్పూర్ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్(పాల్యావత్ లాల్య(లాలూ నాయక్) పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, సాయిరాం యాదవ్, మహేందర్, బోరింగ్ నర్సింహులు, మశ్చందర్, బజార్ పరుశురాం, గడ్డం ఎల్లప్ప, గడ్డం యాదయ్య, కెండ్యాల నరేందర్, కెండ్యాల రాజేష్‌కుమార్, మాధవరెడ్డి, పల్లెరాంరెడ్డి, జైపాల్ నాయక్ పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్‌గౌడ్

ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న రాచాల

చిన్నంబావి, మే 11 ప్రభాతవార్త: రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం తరుగు లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కొల్లాపూర్ నియోజక వర్గంలోని చిన్నంబావి మండలం వెలుగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని రాచాల యుగంధర్ గౌడ్ సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా వరి ధాన్యం పండించే రైతులు వెలగొండ గ్రామంలో ఉన్నారన్నారు. దాదాపు నెల రోజులుగా రైతులు పండించిన ధాన్యాన్ని ఐకెపి కేంద్రానికి అమ్మకానికి తెచ్చారని, నెలరోజులవుతున్నా నేటికీ ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన సరైన సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు. రైస్ మిల్లర్లు ఒక్కో క్వింటాలుకు 5 కిలోల తరుగు తీస్తామని చెప్తూ ఉన్నారని, అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత మండలంలోనే ఈ విధంగా ఉంటే జిల్లాలో రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గతంలోనే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాలలో తూర్పు పట్టే యంత్రాలు లేవని, లోడింగ్‌చేయడానికి వాహనాలు రావడంలేదని సాకులు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని, తరుగు లేకుండా రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐకెపి కేంద్రాన్ని గత రెండు సంవత్సరాలుగా నడుపుతున్న సభ్యుల పేర్ల మీద అకౌంటు లేదని, గతంలో కొనసాగిన సభ్యుల పేరు పైనే నేటికీ అకౌంటు ఉండడం వల్ల కష్టం ఒకరు చేస్తే ఫలితం మరొకరికి దక్కుతుందని, వెంటనే వారి పేరుపై అకౌంట్ ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శరత్‌రెడ్డి, మాజీసర్పంచ్ గుట్టలయ్య, బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ యశ్వంత్, నాయకులు రామన్ గౌడ్, పెద్ద బొడ్డయ్య, వెంకట స్వామిగౌడ్, అశోక్, సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, శివారెడ్డి, రవీందర్ రెడ్డి, పరమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం వరి కొనుగోలులో నిర్లక్ష్యం వీడాలి

బిజెపి నాయకులు కిషన్ నాయక్

పెద్దమందడి, మే 11 ప్రభాతవార్త: పెద్దమందడి మండలంలో రైతులు ఆరు కాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బిజెపి సీనియర్ నాయకుడు కిషోర్ నాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వరి కొనుగోలు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ఆరోపించారు. జిల్లాలో దాదాపు 180 రైస్ మిల్లులు ఉన్నప్పటికీ ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగడం లేదన్నారు. రైస్ మిల్లులకు అలాట్మెంట్లు రావడంలేదని అధికారులు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గన్ని బ్యాగులు అందుబాటులో లేవనే కారణాలతో కొనుగోలు ఆయస్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు తెచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి నిల్వ ఉండటంతో నష్టపోతున్నారని తెలిపారు. అకాల వర్షాలు కురిస్తే రైతుల ధాన్యం తడిసి తీవ్రం నష్టం వాటిలో ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అవసరమైన గన్ని బ్యాగులు రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. రైతుల పట్ల నిరక్ష్య వైఖరి వీడనాడి వెంటనే వరి ధాన్యం సేకరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కిషన్ నాయక్ విమర్శించారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

తరుగు పేరుతో మిల్లర్లు నిలువు దోపిడీ : మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు

మదనాపురం, మే 11 ప్రభాతవార్త: వారి ధాన్యం కొనుగోలులో వలస వహించడం వల్ల ఎక్కడ ధాన్యం అక్కడ నిలిచిపోయిందని అధికారులు పట్టించకపోవడం లేదని మాజీ జడ్పిటిసి కృష్ణయ్య అన్నారు. సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాని కొనుగోలు కేంద్రాలను ఉండిపోయిందని అన్నారు. తరుగు పేరుతో రైతులకు నుంచి కింటకు ఎనిమిది కేజీలు నిలువు దోపిడి చేస్తున్నారని ఆయన ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. గన్ని బ్యాగులు కొరత లారీలు లేకపో వడం, మిల్లుల కేటాయింపు లేకపోవడం25 రోజులు అయిన ధాన్యం మిల్లులకు చేరడం లేదు. ధాన్యం మిల్లులకు చేరేవరకు రైతులకు బాధ్యత కావడంతో వడ్లు కొనుగోలు చేసినప్పటికీ కల్లాల వద్దే రైతులుపడిగాపులు కాయాల్సి వస్తుందని ఆయన అన్నారు. రైస్ మిల్లులు చేస్తున్న దోపిడి పై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి, సింగల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, టౌన్ అధ్యక్షుడుఆవుల బాలకృష్ణ, మండల నాయకులు మనోజ్ కుమార్, చాంద్ పాషా, ప్రవీణ్ రెడ్డి, మాసన్న, దేశి వెంకటన్న, కర్ణాకర్ యాదవ్, పెంటన్న, శివ శంకర్, నాగరాజు, డబ్బా కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సామాజిక అవగాహన కలిగి ఉండాలి

అచ్చంపేట, మే 11 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యతో పాటు సామాజిక అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవి పరంగి అన్నారు. సోమవారం బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కాట్రాజ్ పద్మ హాజరై ప్రిన్సిపల్ రవి పరంగి ఆధ్వర్యంలో కళాశాల బ్రోచర్ ను ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతల పట్ల అవగాహన చేసుకోవాలని సూచించారు. విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవా భావం సమాజంపై అవగాహన పెంపొందించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నర్సింహ, వార్డు సభ్యులు, అశోక్ కుమార్, అధ్యాపకులు దీప్ సింగ్, జాన్ బాబు, శివ కుమార్, కిరణ్, గాయత్రి, గోపాల్, శంకర్, వెంకట స్వామి, నర్సింహా రావు, నర్సింహా పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

లింగాల, మే 11 ప్రభాతవార్త : అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాంపూర్ సర్పంచ్ అతినారపు శివకుమార్ ఆర్థిక సహాయాన్ని అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఇటీవల గోకం బుచ్చయ్య మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ అతినారపు శివకుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు అందించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఉప సర్పంచ్ కృష్ణయ్య, వార్డు సభ్యులు సుధీర్ గౌడ్, రఘుపతయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్, అతినారపు శ్రీను తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల టూ పెద్దూరుకు తరలించిన లారీలు, డీసీఎంలు

ఉప్పునుంతల, మే 11 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులనుంచి మక్కలు విక్రయించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారు, మార్క్ ఫెడ్ వారి సౌజన్యంతో జిల్లాలోని తెలకపల్లి మండలంలో మక్కలు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన మక్కలను ఉప్పునుంతల సొసైటీ గోదాం లో దిం

వరి ధాన్యం లారీలను వేగంగా అన్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ముందుకు వెళ్లాలని సూచించారు. జనగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు క్షేత్ర స్థాయిలో హద్దులను తనిఖీ చేసుకోవాలి. జనగణన 2027 లో భాగంగా మే 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న క్షేత్రస్థాయి హౌస్ లిస్టింగ్ ప్రక్రియ నిర్వహించడానికి వెళ్తున్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఐడి కార్డు జనగణన సామాగ్రి తప్పనిసరిగా అందజేయాలని చార్జ్ ఆఫీసర్లకు కలెక్టర్ సూచించారు. వారి హాజరు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లు మొదటి రెండు మూడు రోజుల్లో తమకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ ల యొక్క హద్దుల్ని తనిఖీ చేసుకునేలా వారికి తెలియజేయాలనీ సూచించారు. హెచ్ఎల్‌బీ ల హద్దుల్ని ఈ మూడు రోజుల్లో తనిఖీ చేసుకొని హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ కు సిద్ధం కావాలన్నారు. ఈ సారిడిజిటల్ పద్ధతిలో జనగనన చేస్తున్న నేపథ్యం లో ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్డేట్ చేయాలని తెలిపారు. జిల్లాలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఎన్యుమరేటర్లు కొంచెం ఉదయం వేళల్లోనే క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని, ఎవరూ వాడ దెబ్బ బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. ఓ ఆర్ ఎస్ కిట్ అందుబాటులో ఉంచాలని ఛార్జ్ ఆఫీసర్స్ కు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భీమ్య నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్‌కుమార్, సీపీఓ హరికృష్ణ, డిఆర్‌డిఓ ఉమాదేవి, వీసీ ద్వారా తహసీల్దార్‌లు, పోలీస్ అధికారులు, సెన్సస్ ఛార్జ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వరి,మొక్కజొన్న వెంటనే కొనుగోలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మొక్కజొన్న పంటను 16లక్షల 46వేల ఎకరాల లో సాగు జరిగిందని వర్షాభావం వల్ల రైతులు మొక్కజొన్న పంటకు ప్రాధాన్యత ఇచ్చారని ఎక్కడ చూసినా మొక్కజొన్న కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయని నేటికి ఒక్క క్వింటాలు మొక్కజొన్న కొనుగోలుచేసిన దాఖలాలు లేవని అన్నారు. ప్రభుత్వం వెంటనే వరి, మొక్క జొన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షములో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెంబడి గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్లఅశోక్, కె. మాణిక్యం, భాను ప్రకాష్, రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, గంధంపరంజ్యోతి, కౌన్సిలర్స్ మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలపై కలెక్టర్ ఆరా..

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా వైద్య సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని, అదేవిధంగా ఆసుపత్రికి అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సరైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ప్రతి ఉద్యోగి బాధ్యతని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరింత పారదర్శకంగా అంగన్‌వాడీ సేవలు

సర్పంచ్ రామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్

రాజాపూర్, మే 11 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడి సేవలు మరింత పారదర్శకంగా విస్తృతం చేసేందుకు అంగన్ వాడి టీచర్లకు మొబైల్స్ ను అందజేసినట్లు రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్ అన్నారు. సోమవారం రాజపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నూతన మొబైల్స్ ను అందజేసినట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు వేగంగా సేవలు అందించేందుకు ఈ మొబైల్స్ దోహద పడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు యాదయ్య, గోనెల రమేష్, గోవర్ధన్ రెడ్డి, నసీర్ బేగ్, కావలి శివకుమార్, కృష్ణ నాయక్, పలువురు అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నీళ్ల నుంచి కొలువుల దాకా..

450 మంది విజేతలకు

డా. జంగం విశ్వనాథ్ ఆత్మీయ సన్మానం

మహబూబ్‌నగర్, మే 11, ప్రభాతవార్త: నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, సమాజం చేసిన అవమానాలు, కుటుంబ బాధ్యతలు, చదువుకోసం నిద్రలేని రాత్రులుగడిపి అవమానించిన చోటే సన్మానం పొందాలని కష్టానికి విజయం తప్పక దక్కుతుందని జంగం విశ్వనాథ్ అన్నారు. ఈ కష్టాలన్నింటినీ తట్టుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన 450 మంది యువత జీవితాల్లో ఆదివారం ఆనందోత్సవ వాతావరణం నెలకొంది. ఏపీ మెగాడీఎస్సీ లోఎంపికైన 300 మంది అభ్యర్థులు, తెలంగాణలో హెచ్‌డబ్ల్యూఓ పోస్టులు సాధించిన 150 మందికి పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రముఖ సైకాలజీ నిపుణుడు డా. జంగం విశ్వనాథ్ మహబూబ్‌నగర్‌లోని తన స్వగృహంలో అపూర్వమైన ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఉద్యోగ విజేతలు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కార్యక్రమ ప్రాంగణం ఉద్వేగభరిత వాతావరణంగా మారింది. ఏపీలోని 28 జిల్లాలు, తెలంగాణలోని 33 జిల్లాల నుంచి విజేతలు మండుటెండలను సైతం లెక్కచేయకుండా పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా డా. జంగం విశ్వనాథ్ మాట్లాడుతూనిరుద్యోగ యువతలోఆత్మవిశ్వాసం పెంపొందించేలా ప్రసంగించారు. ఈ సన్మాన కార్యక్రమం ద్వారా నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు, ఆత్మవిశ్వాసం నింపినట్లు పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి హాజరైన అభ్యర్థులు డా. విశ్వనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగం సాధించిన తర్వాత కూడా తమను గుర్తుంచుకుని సన్మానం చేయడం జీవితాంతం మర్చిపోలేమని పలువురు విజేతలు పేర్కొన్నారు.

హమాలీ ఖర్చులను ప్రభుత్వమే భరించాలి

- రైతులను నిలువు దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- సీపీఎం జిల్లా నాయకులు కేయం మహేందర్

నర్వ, మే11 ప్రభాతవార్త : నర్వ మండల పరిధిలోనీ రాయికోడ్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం జిల్లా నాయలు సందర్శించి అక్కడ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీపీఎం జిల్లా నాయకులు కేయం మహేందర్ పరిశీలించడం జరిగింది. ధాన్యం కొనుగోల్లలో తీవ్రంగా అలసత్వం జరుగుతుందని, ప్రభుత్వము నిర్ణయించింది కాకుండా బస్తాకు అదనంగా మరో కిలో ధాన్యాన్ని తీసుకుంటున్నారనీ రైతులు మా దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అధికారులతోసంప్రదించి అవకతవకలను జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేసి, లారీలను అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు తరలించాల్సిందిగా అధికారులను కోరారు. మిల్లులకు వడ్లను బస్తాలకు నింపి మిల్లులకు తరలించేందుకు అయిన హమాలీ ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. ఇప్పటివరకు ఇంకా చాలా మంది రైతులకు సంచులుఅందలేదని, రైతులకు సరిపడా సంచులను తక్షణమే ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇద్దరు రైతులు సంబంధించిన వరి ధాన్యాన్ని మిల్లుకు తీసుకెళ్లగా అక్కడ కాంట చేసే సమయంలో వేరువేరుగా కాంట చేయకుండా ఒకే రైతు పేరున తూకం వేయించి ధాన్యాన్ని దింపడంతో రైతులు ఎలా సరి చూసుకోవాలన్నారు. వేరువేరుగా తూకం చేయించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసిన లారీలు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ చందు పై చర్యలు తీసుకొని రైతులకు సంబందించిన లెక్కలను సరిచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను కూడగట్టుకొని పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నాను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నర్వ మండల నాయకులు ప్రదీప్, రైతులు ఉన్నారు.

అత్యంత పారదర్శకంగా దాన్యం కొనుగోలు

రైతులు పండించిన వడ్లను అమ్ముకోవడానికి ఎవరిని బతిమాలాల్సిన అవసరం లేదు : మంత్రి జూపల్లి కృష్ణారావు

సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మే 11 ,ప్రభాతవార్త: కొనుగోలు కేంద్రాల్లో అటు రైతులకు, ఇటు మిల్లర్లకు నష్టం కలుగకుండా అత్యంత పారదర్శకంగా కొనుగోలు జరిపి అక్కడే రైతుకు రశీదు ఇవ్వాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రిజూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కల్యాణ సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లోయాసంగి సీజన్‌కు సంబంధించిన వరి, మొక్కజొన్న కొనుగోళ్లపై వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజకుగిట్టుబాటు ధరకల్పించి, అన్నదాతల శ్రేయస్సును కాపాడటమే రాష్ట్ర ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు, కొనుగోలుదారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో వ్యవహరించాలని, ఎక్కడా పారదర్శకత లోపించకూడదని ఆదేశించారు. రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా ప్రభుత్వం అన్ని చర్యలుతీసుకుంటోందని, కొనుగోలుప్రక్రియలో ఎవరూ ఎవరినీ బతిమాలుకునే పరిస్థితి రాకూడదని హితవు పలికారు. కొనుగోలు కేంద్రంలోనే నిబంధనల ప్రకారం వడ్లు నాణ్యత చూసుకొని తూకం చేసి రైతుకు అక్కడే రశీదు ఇచ్చేయాలని అంతే తప్ప రైతు లారీ వెంబడి మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వడ్లు నాణ్యతను బట్టి తరుగు తాలు కొనుగోలు కేంద్రంలోనే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ లారీ మిల్లుకు వచ్చిన తర్వాత తరుగు అనే మాట మాట్లాడకుండా వడ్లు దించుకోవాలని మిల్లర్లను ఆదేశించారు. రైతులునాణ్యమైన వడ్లు ఇవ్వడం లేదని, ఇచ్చిన ధాన్యం మిల్లు ఆడించి ఎఫ్‌సిఐకి క్వింటాలుకు 68 కిలోల చొప్పునతిరిగి ఇవ్వాల్సి ఉంటుందని, నాణ్యమైన వడ్లు ఇవ్వకపోవడం వల్ల మిల్లర్లు నష్టపోతున్నారని మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించినమంత్రి ఎఫ్.సి.ఐ.కి ఇచ్చే 68 కిలోల బియ్యంలో నూకలు, సరిగ్గా గింజలు నిండనివి, ఇతరత్రా కలుపుకొని దాదాపు 23 శాతం ఉంటుందని అందువల్ల మిల్లర్లు నష్టపోయే అవకాశమే లేదని, రైతులకు సహకరించి వారిని ఇబ్బంది పెట్టవద్దని కోరారు. వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ ఐ.కే.పి., లేదా సహకార సంఘం కొనుగోలు కేంద్రాల వద్ద తాలు, తేమ, చెత్త అన్ని చూసి వడ్లు తూకం వేస్తారని, లారీ ఎక్కించిన తర్వాత గోదాం వద్ద, మిల్లువద్ద 46కిలోల తరుగు తీస్తాం అని చెప్పడం లో ఆంతర్యం ఏమిటని, ఆ హక్కు ఎవరిచ్చారని గోదాం సిబ్బందిని, మిల్లర్లను ప్రశ్నించారు. అందుకే జిల్లా యంత్రాంగం కమిటీ ఏర్పాటు చేసుకొని రాబోయే 10,12 రోజులు ధాన్యం కొనుగోలు పైనే దృష్టి సారించాలని కోరారు. మిల్లులో ధాన్యం దించుకోవడం లేదా లోడ్ చేయడంలో హమాలీల ఆవశ్యకత చాలా ఉంటుందని, జిల్లాలో ఉన్న మొత్తం హమాలీలు ఎంతమంది ఉన్నారు, రిజిస్టర్ చేసుకున్న వారి వివరాలు తీసుకొని అందరిని ధాన్యం కొనుగోలులో కేటాయించాలని కలెక్టర్‌ను సూచించారు. ఈ సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో సుమారు 2.5 నుండి 3 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేయడం జరిగిందని ఇప్పటివరకు దాదాపు 1.20 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినట్లు తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని మిగిలిన వాటిని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసేందుకు రోజుకు పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. మిల్లుకు పంపిన ధాన్యం లారీల నుండి ధాన్యం దించుకోవడంలో మిల్లర్లు తరుగు పేరుతో కొంత ఇబ్బందులు పెడుతున్నారని అందువల్ల ప్రతి మిల్లుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలియజేశారు. మిల్లులో త్వరగా వడ్లు దించుకోకపోవడం వల్ల ట్రాన్స్‌పోర్టు సమస్య సైతం ఏర్పడుతుందని తెలియజేశారు. రానున్న 10,12 రోజుల్లో రైతులు పండించిన మొత్తం వడ్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని భరోసా కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ , మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, సివిల్ సప్లైస్ అధికారులు, మార్కెటింగ్, రవాణా శాఖలఅధికారులు, రైస్ మిల్లుల ప్రతినిధులు, వడ్లు కొనుగోలు కేంద్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వాహణ

సమ్మర్ క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

మూసాపేట, మే 11 ప్రభాతవార్త : మూసాపేట్ మండలం సంకల్ మద్ది గ్రామ సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ లో సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, పాఠశాలలో మౌలిక వసతులను పట్టించుకోలేదని, పదేళ్ల పాలనలో టీచర్ల నియామకాలను చేపట్టలేదని, విద్యాశాఖకు నిధులు కేటాయించలేదని బిఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖకు అధిక నిధులు కేటాయించడంతో పాటు 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 15ఏళ్ల తర్వాత సుమారు 19,000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, స్కూలు ప్రారంభమైన మొదటి వారంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు పంపిణీ చేశామని, పదేళ్లలో ఎన్నడు లేని విధంగా విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు. దేవరకద్ర నియోజకవర్గం లో గత పాలకులు పదేళ్లు అధికారంలో ఉండి, కనీసం డిగ్రీ కాలేజ్‌ను ఏర్పాటు చేయలేకపోయారని, కానీ తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజ్ మంజూరు ఏర్పాటు చేశామని, చిన్న చింతకుంట మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలియజేశారు. విద్యార్థులుఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఏకాగ్రతతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సమ్మర్ క్యాంప్ లో అధ్యాపకులు ఇస్తున్న శిక్షణను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని, విద్యార్థులకు మంచి విద్యాబోధన అందుతుందని తెలిపారు, చదువుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చని అన్నారు, తాను, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని ఈ స్థాయికి వచ్చామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణయ్య, తహసిల్దార్ రాజు పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. పావాణి సింగ్, ఉపాధ్యాయులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్, సంకల మద్ది సర్పంచ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, బ్రహ్మయ్య, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

టాపర్స్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కెటిదొడ్డి మే 11, ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల నియోజకవర్గం లోని కె.టి దొడ్డి మండల పరిధిలోని నందిన్నె గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" భాగంలో అదనపు తరగతి గదులు, వేసవికాలం శిబిరం సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన పాఠశాల టాపర్స్ ను సన్మానించి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా గడిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృతంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 99 రోజుల ప్రణాళికల భాగంగా ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమం మార్చి 6నుండి జూన్ 2 తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం వేసవికాలం శిబిరం సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సమ్మర్ క్యాంపు పాఠశాలలో ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు వేసవి కాలం ఎండ త్రీవత ఎక్కువ కావడంతో విద్యార్థులు ఎండలో తిరగకుండా ఉండడానికి ప్రభుత్వమే పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఇండోర్ గేమ్స్, సంస్కృత కార్యక్రమాలు, ఎస్సే రైటింగ్ డ్రాయింగ్, ఆటలు పాటలు వంట విద్యార్థుల్లో దీనిపైన నైపుణ్యత ముందు వాటిని నేర్పించడం జరుగుతుంది చదువుతోపాటు విద్యార్థులకు వీటి పైన కూడా అవగాహన ఉండాలని సూచించారు. గతంలో గట్టు, కెటి దొడ్డి మండలాలలో అక్షరాసతలో 20 శాతం ఉండేది కానీ ఇప్పుడు 60 శాతం వరకు అక్షరాసతతో పెరగడం జరిగింది. అదేవిధంగా ఇప్పటికి ఈ మండలాలలో కొన్ని గ్రామాలలో బాల్య వివాహాలు చేస్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలి అని కోరారు విద్యార్థులను తల్లిదండ్రులు చదివించాలి అని సూచించారు. ఈ మండలాల్లో బాల్య వివాహాలను అరికట్టే విధంగా ప్రజల్లోకి అవగాహన తీసుకురావాలని ఇంటింటికి తిరిగి సర్పంచ్, ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. త్వరలోనే ఈ మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం కావడం జరుగుతుంది. వచ్చే విద్యా సంవత్సరానికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిగారి నేతృత్వంలో గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు 24 రకాల కిట్టు, దుస్తులు విద్యార్థులకు అందజేయడం జరుగుతుంది తెలిపారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపు అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు,, గ్రామ సర్పంచ్ నాగమ్మ, జిల్లా విద్యాధికారివిజయలక్ష్మి,, మండల విద్యాధికారివిజయ్ భాస్కర్, నాయకులుఉరుకుందు, శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్, రంగారెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో నెరవేరిన సొంత ఇంటి కల

- మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రంగినేని శ్రీనివాసరావు

లింగాల, మే 11 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో నిరుపేకుటుంబాల సొంతింటికల నెరవేరిందని, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ సహకారంతోఅర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిఅండగా నిలుస్తామని అన్నారు. సోమవారం అంబటపల్లి, కోమటికుంటగ్రామాలలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులు కట్టుకున్న ఇందిరమ్మ గృహ ప్రవేశాన్ని ఆయన చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇచ్చివారు సొంతింట్లో జీవించాలనోదేకాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి ఇంటి ఐదులక్షల రూపాయలు అందిస్తున్నదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగాజరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో దగాపడ్డారని, డబుల్ బెడ్ రూములను నిర్మించి ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు ఈ కార్యక్రమంలో అంబటిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అచ్యుతా రెడ్డి, మాజీ సర్పంచ్ రవిశంకర్, సాయి రెడ్డి, కోమటికుంట సర్పంచ్ విశ్వనాథం, ఉప సర్పంచ్ జంగి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

అచ్చంపేట, మే, 11 ప్రభాతవార్త: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని కంటి వైద్య నిపుణులు డా. విజయ్ పాల్ తెలిపారు. కంటి వైద్య శిబిరంలో 80 మంది రోగులను పరీక్షించి 42 మందిని కంటి శుక్లాలు ఆపరేషన్ కొరకు ఎంపిక చేసి వారిని ప్రత్యేక అంబులెన్స్ లో కందూరు రామ్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి కంటి శుక్లముల ఆపరేషన్ నిమిత్తమై తీసుకొన్ని వెళ్లారని తెలిపారు. ఈ శిబిరంలో అచ్చంపేట ఏరియా ఆసుపత్రి విశ్రాంత ఆప్తాలమిక్ అధికారి సిహెచ్ గణేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి 41 ఫిర్యాదులు

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట, మే 11 ప్రభాతవార్త : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలోనిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను జిల్లాకలెక్టర్, అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజల సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) ఫణీంద్ర రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనగణన సర్వే ప్రారంభం

శ్రీరంగాపూర్, మే 11 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న 2027 జనగణన తొలి విడత కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి ప్రారంభం అ